క్లుప్తంగా

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్


ఎ.వాసంతి

నరసాపురం: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి చెప్పారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని చెప్పారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని వివరించారు. క్రిమినల్ కేసులు, మనోవర్తికేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు రాజీచేసుకోవచ్చని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేసుకునే విధంగా పోలీసుశాఖ, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

వల్లూరు పీహెచ్‌సీకి బెడ్ షీట్ల అందజేత


వల్లూరు పీహెచ్‌సీకి బెడ్ షీట్లు, పిల్లో కవర్లు, లైట్లు అందిస్తున్న దాతలు

పెనుగొండ: పాలకొల్లు నాలం సీతారత్నం ఫ్యామిలీ ట్రస్ట్ వల్లూరు పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సు మంగతాయారు ద్వారా పీహెచ్‌సీకి బెడ్ షీట్లు, పిల్లో కవర్లు, థియేటర్ పోకస్ లైట్లు అందించారు. వీటిని ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగబర్తి సూర్యకుమారి చేతుల మీదుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించారు. దాతలకు మెడికల్ ఆఫీసరు డాక్టరు హైందవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుప్తా, పద్మ, మోహన్, వాణీ, వైవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈకి ఉత్తమ అవార్డు


ఉత్తమ ఏఈ అవార్డు అందుకుంటున్న పెనుగొండ హౌసింగ్ ఏఈ లక్ష్మణ్

పెనుగొండ: గృహనిర్మాణ శాఖలో విశిష్ట సేవలందించినందుకు గాను ఉత్తమ ఏఈ అవార్డు అందుకున్న పెనుగొండ హౌసింగ్ ఏఈ బొక్కా లక్ష్మణ్‌ను పలువురు అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ఎస్పీ నయీం అస్మీల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ వారికి మోగల్లుకి చెందిన పి.బలరామకృష్ణం రాజు–జానకి దంపతులు 8 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. వీరికి ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, ఫొటో అందించారు.

సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు

వీరవాసరం: స్థానిక మెయిన్ స్కూల్‌లో మద్దాల రామకృష్ణమ్మ ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దాల తాతారావు ఆర్థిక సహాయంతో శనివారం సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అంతా చక్కగా చదువు కుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేంద్ర దివాకర్, గ్రంధి పెద్దకాపు, మద్దాల రాజేష్ నాయుడు, మద్దాల శివాజీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల స్ఫూర్తి గౌతు లచ్చన్న

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధులు, బీసీల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం స్థానిక హౌసింగ్ బోర్డులో బీసీ సంఘం జాతీయ నాయకులు తాతా శ్రీనివాసరావు ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ గౌతు లచ్చన్న జీవితం ఆయన చేసిన పోరాటాలు, తదితర విశేషాలను వెల్లడించారు. బీసీ సంఘం నాయకులు వర్తనపల్లి కాశీ, కోట రాంబాబు, అత్తిలి శ్రీను, అత్తిలి బాబి పాల్గొన్నారు.

పుంత రోడ్ల చింత తీరేదెన్నడు?


అధ్వానంగా ఉన్న సత్యవరం పుంత రహదారి


వదలి సుబ్బారాయుడు పుంత దారి ఇలా..


దొంగరావి పాలెం పుంత రహదారి దుస్థితి

అధ్వానంగా మారుతున్న పుంత రోడ్లు

పెనుగొండ: వ్యవసాయ మార్కెటింగ్ యార్డులకు నూతన కమిటీల నియామకంతో పుంత రోడ్లపై రైతన్నలు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. ఆరుగాలాలు పాటు కష్టించి సాగు చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లులకు చేర్చుకోవడానికి పుంత రోడ్లు ఉపయోగ పడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో పుంత రోడ్లు నిర్మాణాలు చేశారు. అనంతరం పుంతరోడ్ల నిర్మాణాల వైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధుల కోత విధించడంతో పుంతరోడ్ల నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. 2014 ప్రాంతంలో పెనుగొండ మండలంలో తామరాడ, వదలి, నడిపూడి, రామన్నపాలెం ల్లోనూ, పెనుమంట్ర మండలంలో రామేశ్వరం, జుత్తిగ, ఆలమూరు వంటి ప్రాంతాల్లోనూ పుంత రోడ్ల నిర్మాణాలు దాదాపుగా రూ.60 లక్షలతో పూర్తి చేశారు. అనంతరం మరోసారి నిర్మాణాలు చేయడానికి రూ.80 లక్షలతో సైతం పలు పుంతరోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే నిధుల కోత విధించడంతో ప్రతిపాదనల స్థాయిలోనే అటకెక్కాయి. అప్పటి నుంచి పుంత రోడ్లపై ఆశలు పెట్టుకున్నా రైతులకు నిరాశే మిగులుతుంది.

పుంత రోడ్లు నిర్మించాలని రైతుల వినతులు

ఇటీవల పెనుగొండ, ఆచంట ఏఎంసీలకు నూతన కమిటీల నియామకాలు పూర్తికావడంతో మరోసారి పుంత రోడ్ల నిర్మాణాలుపై రైతులు విజ్ఞప్తులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెనుగొండ మండలం, పెనుమంట్ర మండలాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు చేపట్టాలంటూ రైతులు విన్నవించుకుంటున్నారు. వదలి నుంచి దొంగరావిపాలెం వెళ్లే పుంత రహదారిలో వందలాది మంది రైతులు పంట ఉత్పత్తులను రోడ్డుపైకి తెచ్చుకోవడానికి నానావస్థలు పడుతున్నారని, పుంత రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు తప్పుతాయంటున్నారు. అదేవిధంగా పెనుగొండ అడ్డపుంత రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రహదారిలో రైతుల వరిపొలాలుతో పాటు, కాలనీలు సైతం ఉండడంతో పుంత రహదారి నిర్మాణం చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు, రైతులు విన్నవించుకుంటున్నారు. దీంతో పాటు సత్యవరం పుంత రహదారి నిర్మాణం చేపట్టాలంటూ రైతులు కోరుతున్నారు. రామన్నపాలెం, వదలి, ఇలపర్రు, నడిపూడి, దేవ ల్లోనూ పుంత రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనారోగ్య బాధితునికి ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకటరామరాజు అందించిన రూ. 10 వేల చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు బాధితుని తండ్రికి అంజేశారు. ఈ సందర్భంగా బుద్ధరాజు మాట్లాడుతూ పట్టణానికి చెందిన కనుమూరి భాను శివవర్మకు ఇటీవల చెయ్యి విరగడంతో వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహకారం అందించామన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ బాబ్జికి అవార్డు


పురస్కారం అందుకుంటున్న ఏఈ బాబ్జి

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం డివిజన్ విద్యుత్ శాఖ పరిధిలో పాలకొల్లు సబ్ స్టేషన్ ఏఈ ఎస్‌కే బాబ్జి అందించిన ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం విజయవాడలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మాడి పృథ్వీరాజ్ చేతులు మీదుగా పురస్కారంతో పాటు నగదు కూడా అందుకున్నట్లు బాబ్జి శనివారం విలేకరులకు తెలిపారు. పట్టణంలో 139 సోలార్ సర్వీసులకు గాను 473 కిలో వాట్స్ సామర్థ్యంతో గ్రిడ్‌కి అనుసందానం చేసినందుకు తనకు ఈ పురస్కారం అందించారన్నారు. పురస్కారం అందుకున్న బాబ్జిని ఏడీఈ రామకృష్ణ, విద్యుత్ శాఖ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

గ్రామాల్లో కృష్ణాష్టమి సందడి


పెనుగొండ: శ్రీకృష్ణుని వేషదారణలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు


యలమంచిలి: శ్రీకృష్ణునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెనుగొండ: పెనుగొండ, ఆచంట మండలాల్లో శనివారం కృష్ణాష్టమి సందడి నెలకొంది. ఉదయం నుంచి చిన్నారులు శ్రీకృష్ణుడు వేషధారణల్లో అలరించారు. వంటి నిండా నీలం రంగు పూసుకుని చేతిలో వేణువును పట్టుకొని చందాలు వసూలు చేసీ మరీ ఉట్టికొట్టారు. ఆలయాల్లో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ములపర్రులో చిన్నారులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. ఆలయాల వద్ద శనివారం రాత్రి ఉట్టి కట్టి పోటీలు నిర్వహించారు. ఉట్టికొట్టిన వారికి బహుమతులు అందించారు. ఉట్టి కొట్టడానికి చిన్నారులు పోటీ పడ్డారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గీతామందిరంలో రాధాకృష్ణులకు, ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే రాత్రి ఆలయం ముఖధ్వారం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక చినగోపురం శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కెనాల్ రోడ్డు ఎర్రవంతెన వద్ద కొలువై ఉన్న శ్రీ కృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన పూజా కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. రాత్రి 6 గంటలకు 12 సంవత్సరాల్లోపు చిన్నారులతో చిన్ని కృష్ణుడు, గోపికమ్మ వేషధారణ పోటీలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఉట్టి మహోత్సవం ఏర్పాటుచేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరానికి అందించాలంటే హిందూ పండుగలన్నింటిలో బాలలు, యువతను భాగస్వాములు చేయడం ద్వారానే సాధ్యమని సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు, చాంబర్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ చేగొండి వీర వెంకట సత్యనారాయణ మూర్తి అన్నారు. దొడ్డిపట్ల గ్రామంలోని శ్రీ కేశవ స్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి (గోకులాష్టమి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వారి సహకారంతో 15 ఏళ్ల లోపు వయసున్న బాల బాలికలు వేసిన శ్రీకృష్ణ వేషధారణతో కార్యక్రమం ప్రారంభించారు. శ్రీకృష్ణ వేషధారణ వేసిన వారిలో విజేతలకు బహుమతులతో పాటు మిగిలిన వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు చేగొండి సత్యనారాయణమూర్తి, శ్రీవిద్యా ఉపాసకురాలు డాక్టర్ నంబూరి భాగ్యలక్ష్మీ, మాజీ సర్పంచ్‌లు చేగొండి సూరిబాబు, చేగొండి రవిశంకర్, ఆలయ అధికారి ములపాక రఘునాథ్, సీహెచ్ గోపాలకృష్ణ, రామ్‌జీ, యర్రంశెట్టి వెంకటరత్నం తదితరులు కృష్ణావతార విశేషాలు, హిందూ పండుగల ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం కన్నయ్య కోలాట బృందం కోలాటం ప్రదర్శన చేసింది. చివరగా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి వేడుక నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి సందర్భంగా దేవేరులకు పంచామృతాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి వెంకట రాజ గోపాలకృష్ణ బ్రహ్మత్వంలో తులసీ దళాలతో సహస్ర నామార్చన, అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

మార్టేరు శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి


పెనుమంట్ర: ఉట్టి కొడుతున్న యువకులు


కృష్ణావతారంలో వెంకన్న

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేకటేశ్వర స్వామి ఆలయ ఆలయ ఆవరణలో శనివారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరునికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించి అనంతరం స్వామివారిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు నుంచి ఎనిమిది సంవత్సరాలలోపు బాల బాలికలకు రాధాకృష్ణ, గోపికల వేషధారణ, డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కోలాట భజనలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, యువతి యువకులకు వేరువేరుగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు.


పెనుగొండ: రామన్నపాలెంలో చిన్నారుల కోలాహలం


పెనుగొండ: సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బ వద్ద చిన్నారుల సందడి


యలమంచిలి: దొడ్డిపట్లలో బాలలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

క్షీరారామలింగేశ్వరుని సేవలో వివేకానందరెడ్డి


ఇంజనీర్ ఇన్ చీఫ్ వివేకానందరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని ఆర్అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం వీఆర్‌వీ వివేకానందరెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన వివేకానందరెడ్డికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా గణపతిని దర్శించుకుని క్షీరారామలింగేశ్వర స్వామి, జనార్ధనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ పి.వాసు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈయన వెంట ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, డీఈఈ బీవీ రమణ, ఏఈ ఎస్.రాజశేఖర్, భీమవరం డీఈఈ పీవీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



వీరవాసరం: మండలంలోని బాలేపల్లిలోయర్రంశెట్టి వెంకటేశ్వరరావు మాస్టారు ఇంట్లో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా ఉండే అరుదైన బ్రహ్మకమలాలు శనివారం వికసించాయి. బ్రహ్మకమలాలు హిమాలయపర్వతాలు, ఉత్తరప్రదేశ్, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, దక్షిణ చైనా ప్రాంతాల్లో దర్శనమిస్తూ ఉంటాయి. ఈ బ్రహ్మకమలములను కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్ అని పిలుస్తారు. ఇలాంటి అరుదైన పుష్పం పవిత్రమైన శ్రీ కృష్ణాష్టమి రోజు వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని వెంకటేశ్వరరావు తెలిపారు.

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం


రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల మధ్య కనిపించని మొక్కలు

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడబడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడి, అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడీ గతంలో ప్లాట్‌ఫామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరిబండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల వద్ద పాతిన మొక్కలు లేకుండా పోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతుల అందజేత


విద్యార్థినులకు నగదు బహుమతులు అందిస్తున్న వెంకటరమణారావు

పాలకొల్లు సెంట్రల్: ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రకటించిన ఓ ఛాలెంజ్‌ను ఎనిమిది మంది విద్యార్థులు సాధించి చూపించారు. తన ఛాలెంజ్‌ను స్వీకరించి పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు అన్న మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. మండలంలోని పూలపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాల సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వారది వెంకటరమణారావు రూ. 50 వేలు నగదు బహుమతి అందజేశారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.10,116లు 500 మార్కులు దాటితే రూ.1116లు, ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1116లు, నేషనల్ స్థాయిలో విజేతలకు రూ.10,116లు నగదు బహుమతి ఇస్తానని వెంకటరమణారావు ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు పి.వర్షిత నాగలక్ష్మి 568, జి.తేజస్వి 562, డి.రూపా తేజస్వి 552 మార్కులు సాధించగా ఒక్కొక్కరికి రూ.10,116లు అందజేశారు. ఏవై లాస్యప్రియ 549 మార్కులు సాధించడంతో రూ.5116లు అందించారు. ఎస్.కీర్తన 541, ఎస్ సత్యమణి 526, ఎం రమ్యశ్రీ 510 విద్యార్థినులకు రూ.1116లు అందజేశారు. యోగాంధ్ర స్టేట్ మీట్‌లో ప్రథమస్థానం సాధించిన బి.విజయ్ కుమార్‌కు రూ.1116లు చెక్కులను అందజేశారు. వీరికి రూ. 40 వేలు ఖర్చు కాగా మిగిలిన రూ.10 వేలతో స్పోర్ట్స్ కిట్లు అందించారు. తన తండ్రి వారది సూర్యనారాయణ జ్ఞాపకార్థం నగదు పురస్కారం అందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీటీ వెంకటకుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందించారు.

అయోధ్య రాముని ఫొటోల పంపిణీ


అయోధ్య రాముని ఫొటోలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: అల్లూరి రాఘవ రాజు చారిబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో మండలంలోని నెలమూరు గ్రామంలో శనివారం అయోధ్య రాముల వారి ఫొటో పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో శ్రీరాముని పటాన్ని స్థాపించడం ద్వారా శాంతి, సౌభాగ్యం, ఐక్యత నెలకొంటాయని వివరించారు. అనంతరం మహిళలు, పురుషులు, పిల్లలు అందరూ భక్తిశ్రద్ధలతో రాముల వారి టైల్స్ చిత్రాలను స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు గొట్టుముక్కల భాస్కర్ వర్మ, పీఎస్ఎన్ రాజు, అధ్యక్షుడు పీవీఎస్ఎస్ఎం రాజు (డీటీడీసీ బాబు), క్షత్రియ సంక్షేమ పరిషత్ చెకూరి సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు అన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, సీఎస్‌డీ, సీఎస్ఐటీ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్తంగా ఈ నెల 14, 15 తేదీల్లో టెక్నాలజీ సెంటర్లో 'వేదిక్ విజన్ 2కె25' పేరిట నిర్వహించిన హ్యాక్ థాన్ పోటీల్లో విజేతలకు శనివారం ఉదయం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఉభయగోదావరి జిల్లాలలోని 8 ఇంజనీరింగ్ కళాశాల నుండి 53 బందాలుగా 265 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ప్రథమ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాధించగా, ద్వితీయ స్థానంలో సీఎస్ ఐటీ విభాగం విద్యార్థులు నిలిచారు. మూడవ స్థానంలో ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, డాక్టర్ పి.సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యం లో ఆర్య వైశ్య కల్యాణ మండపం లో ఆదివారం ఉచిత వేరికోస్ వైన్స్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గ్రంథి రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలె పురుగు లాంటి నరాలు, పాదం వేలిలో గ్యాంగ్రిన్ రావడం,కాళ్ళల్లో, పాదాల్లో నలుపు రావడం, ఉబ్బిన నరాలు వంటి వ్యాధులకు చికిత్సలకు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.. ఈ ఉచిత వైద్య శిబిరంలో రూ.5 వేలు విలువైన పరీక్షలు ఉచితంగా చేస్తారని వివరించారు.